# స్వేచ్ఛ

"మీకసలు బుద్ధుందా?" గట్టిగా అరిచింది శంకరి. భార్య అలాగన్నందుకు దయానంద్ పెద్దగా చలించలేదు. అతనికి కోపమూ రాలేదు.

అయిదేళ్ళుగా, అవిరామంగా స్త్రీవాదం గురించి ఉపన్యాసాలిస్తూ, చర్చలలో పాల్గొంటూ, స్త్రీ స్వేచ్ఛ గురించి, స్త్రీ సమస్యల గురించి, వారి ఆర్థిక స్వాతంత్ర్యం గురించి వారు కూపస్థమండూకాలై ఈ పురుషాధిక్య లోకంలో పొందుతున్న అవమానాల గురించి, అన్యాయాల గురించి అనుక్షణం స్పందిస్తూ, ఉన్న శంకరి ఆ మాత్రం ఘోర్సుగా మాట్లాడడం సహజమేననిపించిందతనికి. అతనికి కావలసినది వాద ప్రతివాదాలు కాదు, కోపతాపాలు కాదు. అతను భార్యతో ఒక ముఖ్యమైన సమస్య గురించి చెప్పాలనుకుంటున్నాడు. అది ఆమె వినాలి.

"సరే, నాకు బుద్ధి ఉందా లేదా? అన్న విషయం తర్వాత ఆలోచిద్దాం గానీ ముందు నేను చెప్పేది విను".

"ఏమిటి? మీరేం చెప్పబోతున్నారో నాకు తెలుసు"

"శంకరీ నేను మాట్లాడబోతున్నది నా సమస్యా కాదు, నీ సమస్యా కాదు"

"అవును, 'స్వేచ్ఛ' గురించి – దాని పేరులోనే ఉంది కదా! అది మీకూ నాకూ కూతురునే కావచ్చు కానీ దాని జీవితానికి సంబంధించిన నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ మీకు లేదు, నాకూ లేదు".

దయానంద్‌కి ఛర్రున కోపమొచ్చింది.

"ఇప్పుడు నిజంగా అర్థమవుతోంది నీకు బుద్ధిలేదని" అన్నాడు.

మీరేమన్నా ఫర్వాలేదు. మీ సనాతన భావాలతో, సంప్రదాయాల పేరుతో, దాని కోసం పెళ్ళికొడుకుల వేట మొదలుపెట్టి, కారబ్బూందీ, లడ్డూలతో పెళ్ళి చూపులు జరిపించి... ఛ- ఛ నాన్సెన్స్ నాకిష్టం లేదు- నాకసహ్యం - దానికిష్టమైన వాడిని అదే చేసుకుంటుంది"

"షటప్! చాలించు నీ అధిక ప్రసంగం" తీవ్రంగా అన్నాడు.

"ఏం? ఎందుకని? నేనన్న దానిలో తప్పేముంది".

దయానంద్ కొంచెం తమాయించుకున్నాడు.

"చూడు శంకరీ, ప్రతీ మనిషికి ఒక స్వభావం అనేది ఉంటుంది. అలాగే ఆడపిల్లలందరూ ఒకేలా ఉండరు. ఒకేలా ఆలోచించరు. ఒకేలా ప్రవర్తించరు, కొందరు తమ చుట్టు ఉన్న వారిలో తమకు నచ్చిన గుణాలున్న వారిని ఎంపిక చేసుకుంటారు. స్నేహం చేస్తారు. స్వయంగా ఒక అభిప్రాయానికి వస్తారు. మరికొందరు ఆ దృష్టిలోనే ఉండరు. ఇలాంటి వ్యవహారాలెక్కువగా పెట్టుకోరు. అంటే ప్రేమించటం తప్పు అని కాదు. అలాంటిదేమీ లేకపోవడం నేరమూ కాదు. మన 'స్వేచ్ఛ' చిన్నప్పటి నసుంచీ ఒక తరహా పిల్ల. ఎప్పుడూ దాని చదువూ, దాని గొడవే తప్ప వేరేం లేదు. చేసే పని చేసుకుపోవడమే తప్ప, చెప్పడమే తక్కువ.

"అంటే డాక్టరై ప్రాక్టీసు చేస్తున్న నా కూతురికి ఏం తెలీదంటారా?" కస్సుమంది.

"పోనీ దాని మనసులో ఎవరేనా ఉన్నారేమో అడక్కపోయావా? అదొక మాట చెప్తే పెళ్ళి చెయ్యడానికి నేనూ, నువ్వూ సిద్ధమే కదా!

శంకరి కాస్త తడబడింది. "అలాంటిదేం లేదనే అంటోంది".

"మరి, మనం మనకి తెలిసిన ప్రపోజల్ చెప్పడంలో తప్పేముంది?"

"తప్పని కాదు, అసలు - నాకీ పద్ధతే నచ్చదు" శంకరి విసుగ్గా ముఖం పెట్టింది.

చూడూ! ప్రతి దేశానికీ ఒక సంస్కృతి ఉంటుంది. కొన్ని సంప్రదాయాలుంటాయి. కాల మాన పరిస్థితుల కనుగుణంగా చెడుని తొలగించి మంచిని స్వీకరించాలి" అన్నాడు.

"మంచి అనేదే కన్పించటం లేదు నాకు"

"అబద్ధం, నీకూ నాకూ పెళ్ళి సంప్రదాయ సిద్ధంగానే జరిగింది. నువ్వు హాయిగానే వున్నావుగా"

"మన సంగతి వదిలేయండి"

దయానంద్ పకపకా నవ్వాడు.

"పోనీ వదిలేద్దాం గానీ.... ఇంతకీ నీ కూతురు ఫెమినిస్టా- కాదా" అన్నాడు.

"నూటికి నూట ఇరవై పైసల ఫెమినిస్టు" అంది ధీమాగా.

"అయితే మరీ మంచిది. కానీ ఎప్పుడూ నీలా ఉపన్యాసాలు ఇవ్వడం, మగాళ్ళని చెరిగిపారేయడం లేకపోయేసరికి సందేహమొచ్చి అడిగాను" అన్నాడు. అతని మాటల్లో వ్యంగ్యం శంకరికి చురుక్కుమనిపించింది.

"ఏమిటీ? మీకు నేనంటే వేళాకోళంగా ఉందా" అంది చురుకుగా చూస్తూ.

సరిగ్గా అప్పుడే నీట్‌గా తయారై వచ్చిన 'స్వేచ్ఛ'ని చూసి ఇద్దరూ ఒక్కక్షణం నిశ్శబ్దమైపోయారు. ఆమె సన్నగా, పొడుగ్గా, ఛామనఛాయగా కళకళలాడే ముఖంతో చూడముచ్చటగా ఉంది.

'స్వేచ్ఛ' ఎమ్.బి.బి.ఎస్. చేసి ఒక లీడింగ్ డాక్టరు దగ్గర అసిస్టెంట్‌గా చేరిందీ మధ్యే.

"ఏమిటి నాన్నగారూ! ఇద్దరూ సీరియస్‌గా ఏదో చర్చిస్తున్నట్టున్నారు" అంది.

"అబ్బే ఏం లేదు గానీ, నువ్వేమిటమ్మా ఎనిమిది గంటలకే బయలుదేరావు" అన్నాడు దయానంద్.

"టిఫినైనా తినలేదు - ఇడ్లీ రెడీగా ఉంది. పచ్చడి చేద్దామనుకుంటూనే ఇలా కూర్చుండిపోయాను" అంది శంకరి.

"పచ్చడి లేకపోతే పంచదారతో తిన్నాను గానీ మీ ఇద్దరూ నా పెళ్ళి గురించి వాదులాడుకోవడం నేను వింటూనే ఉన్నాను. నేను ప్రేమించి నాకిష్టమైనవాడిని పెళ్ళి చేసుకోవాలా? లేక మీరు చూపించిన పెళ్ళి కొడుకుల్లో ఎంపిక చేసుకుని పెళ్ళాడి సుఖంగా ఉండాలా అనే సమస్య నాది. మీది కాదు. అమ్మా! మన స్త్రీ వాదం మధ్య తరగతి మట్టి గోడల మధ్యనే ఉండిపోతే ఎలా!" అంది తల్లి వైపు చూసి.

"ఏమిటమ్మా నువ్వనేది?"

"చెప్తున్నా - ఊరు శివార్లలోఎన్నో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్కడ ఎందరో స్త్రీలు రోజు కూలీకి పనిచేస్తున్నారు. వారి ఆరోగ్యం, పరిశుభ్రత గురించి,

పిల్లల గురించి, వారి ఆరోగ్యం గురించి ఎడ్యుకేట్ చెయ్యాలని ప్రోగ్రామ్ పెట్టుకున్నాము. వారికి పూర్తిగా మెడికల్ చెకప్ చేసి ఉచిత వైద్య సదుపాయం కలిగించాలని నా ఆశ. నిజంగా అవసరంలో ఉన్న స్త్రీలకి సాయం చెయ్యాలని నా ఉద్దేశం.

"స్వేచ్ఛా"

"అవును నాన్నగారూ, ఎవరికి చేతనైన కృషి వాళ్ళు చేయడం అవసరం. ఒక డాక్టరుగా నేనీ బాధ్యత తీసుకుని నెలకి రెండు రోజులు కేటాయించుకున్నాను. అమ్మా వెళ్తున్నా."

(మహిళ, ఆంధ్రప్రభ అనుబంధం, 13.10.1994)